క్లుప్తంగా

ఉచిత నేత్ర వైద్య శిబిరం

కోస్గి: జిల్లా అంధత్వ నియంత్రణ సంస్థ, లయన్స్ క్లబ్ కోస్గి శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. గురువారం ప్రభుత్వాస్పత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన శిబిరంలో నేత్ర వైద్యులు భాస్కర్ గౌడ్ మొత్తం 80 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 35 మందికి కంటిలో శుక్లాలు ఉన్నట్లు గుర్తించారు. కంటి శుక్లాలు ఉన్న వారికి మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని లయన్ రాంరెడ్డి కంటి ఆస్పత్రిలో ఉచితంగా ఆపరేషన్లు చేస్తామన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు బెజ్జు వెంకట్రాములు, ప్రతినిధులు వెన్న శేఖర్, పూర్ణచందర్ యాదవ్, సురేష్ గౌడ్ పాల్గొన్నారు.

‘రైతుబంధు’కు దరఖాస్తు చేసుకోవాలి

ఊట్కూరు: రైతుబంధుకు దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయ అధికారి గణేష్‌రెడ్డి గురువారం ఓ ప్రకటనలో కోరారు. ఈ నెల 16వ తేదీలోగా రిజిస్ట్రేషన్లు, మ్యూటేషన్లు చేసుకున్న రైతులు రైతుబంధుకు అర్హులని తెలిపారు. పట్టాదారు పాస్‌బుక్, ఆధార్‌కార్డు జిరాక్స్, బ్యాంక్ ఖాతా తదితర ధ్రువపత్రాలను తీసుకొని సంబంధిత అధికారులకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

సాధారణ కాన్పులో కవలలు జననం



కోస్గి: గుండుమాల్ మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో కాన్పు కోసం వచ్చిన గర్భిణులకు వైద్యులు, సిబ్బంది సాధారణ కాన్పు చేశారు. మండలంలోని ముదిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన కురువ మంజుల రెండో కాన్పు కోసం బుధవారం సాయంత్రం పీహెచ్‌సీ వచ్చింది. అక్కడి వైద్యురాలు కిష్టమ్మ సిబ్బందితో కలిసి అదే రోజు రాత్రి సాధారణ కాన్పు చేయగా ఇద్దరు మగ కవల పిల్లలకు జన్మనిచ్చింది. పిల్లలతో పాటు తల్లి ఆరోగ్యంగా ఉందని వైద్యులు తెలిపారు.

అమరుల సంస్మరణ సభకు కౌన్సిలర్లు గైర్హాజరు

మక్తల్: మండల కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన అమరవీరుల సంస్మరణ సభకు కొందరు కౌన్సిలర్లు గైర్హాజరయ్యారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి కౌన్సిలర్లు గైర్హాజరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రం సాధించాక నియోజకవర్గంలో మూడు మున్సిపాలిటీలు మక్తల్, అమరచింత, ఆత్మకూర్ ఏర్పడ్డాయన్నారు. అనంతరం అమరవీరుల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. రెండు నిమిషాలు మౌనం పాటించారు.

విశ్వహిందూ పరిషత్ పట్టణ కార్యవర్గం ఎన్నిక

మరికల్: విశ్వహిందూ పరిషత్ పట్టణ కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రవి, పెద్దచింతకుంట భజరంగ్‌దళ్ గ్రామ అధ్యక్షుడిగా దేవేందర్‌గౌడ్, ప్రధానకార్యదర్శిగా రఘు ఎన్నికయ్యారని పరిషత్ మండల అధ్యక్షుడు రాంప్రకాష్‌గుప్తా, భజరంగ్‌దళ్ మండల అధ్యక్షుడు రాజు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నారాయణపేట: 132 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 9 నుంచి 12 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ మహ్మద్ రఫీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంతో పాటు మండలంలోని చిన్నజట్రం, కోటకొండ, సింగారం, పేరపళ్ల తదితర సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరా ఉండదని.. విద్యుత్ వినియోగదారులు, రైతులు సహకరించాలని కోరారు.

నేడు అథ్లెటిక్స్ పోటీలు

నారాయణపేట రూరల్: పట్టణంలోని మినీ స్టేడియం గ్రౌండ్‌లో శుక్రవారం అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించనున్నట్లు సంఘం నాయకులు రమణ, అంబరీష్ గురువారం తెలిపారు. అండర్–8 నుంచి 16 వరకు లాంగ్‌జంప్, షాట్‌పుట్, పరుగు పందెం పోటీలు ఉంటాయన్నారు. ఉదయం 10 గంటలకు నేరుగా మైదానానికి రావాలని సూచించారు.

కొనసాగుతున్న మండల సాధన దీక్షలు

నారాయణపేట రూరల్: కోటకొండ మండల సాధన సమితి ఆధ్వర్యంలో చేపడుతున్న నిరహార దీక్షలు గురువారం 44వ రోజుకు చేరాయి. బొడ్రాయివీధి యువత దీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీవైఎల్ నాయకుడు కాశీనాథ్ మాట్లాడుతూ.. మండల ఏర్పాటుతో భవిష్యత్‌లో అన్నిరంగాలు అభివృద్ధి చెందుతాయని, విద్యారంగంలో ఇంటర్‌తో పాటు వివిధ విద్యాలయాలు వచ్చే అవకాశం ఉందన్నారు. పీహెచ్‌సీ నుంచి 24 గంటల ఆస్పత్రిగా మారుతుందని తెలిపారు. రాజకీయ దురుద్దేశంతోనే బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి చొరవ తీసుకొని కోటకొండను మండలం చేయాలని డిమాండ్ చేశారు. సర్పంచ్ విజయలక్ష్మి, రాము, కెంచె శ్రీనివాస్, యాదగిరి, చెన్నప్ప, నర్సింహులు పాల్గొన్నారు.



దామరగిద్ద ఎంపీడీఓ కార్యాలయంలో..



మద్దూరులో మౌనం పాటిస్తున్న ఎంపీపీ, అధికారులు

అమరవీరులకు ఘన నివాళి

నారాయణపేట రూరల్: మండలంలోని కోటకొండలో గురువారం అమరవీరులకు నివాళి అర్పించారు. పీవైఎల్ నాయకుడు సలీం మాట్లాడుతూ.. తెలంగాణ వస్తే నీళ్లు, నియామకాలు వస్తాయని నమ్మిన ప్రజలను ముఖ్యమంత్రి కేసీఆర్ నట్టేట ముంచారని, కల్వకుంట్ల కుటుంబం బాగుపడిందన్నారు. తెలంగాణ అమరుల కుటుంబాలను ఆదుకోవాలని కోరారు.

– మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అమ్మకోళ్ల శ్రీనివాస్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు అంజలి, ఎంపీడీఓ రాము, సూపరింటెండెంట్ శోభారాణి అమరవీరులకు నివాళి అర్పించారు. రెండు నిమిషాలు మౌనం పాటించారు.

దామరగిద్ద: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అమరవీరుల చిత్రపటాలకు, స్థూపానికి అధికారులు, ప్రజాప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న నాయకులను సన్మానించారు.

ధన్వాడ: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ పద్మిబాయి అధ్యక్షతన ప్రత్యేక సర్వసభ్య సమావేశం నిర్వహించారు. వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. కార్యక్రమంలో జెడ్పీ కో–ఆప్షన్ సభ్యుడు వాహిద్, ఎంపీటీసీ సభ్యులు సుధీర్‌కుమార్, మాధవి, ఎంపీడీఓ సద్గుణ తదితరులు పాల్గొన్నారు.



ధన్వాడలో అమరవీరులకు నివాళులు అర్పిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

మరికల్: స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచ్ గోవర్ధన్, ఎంపీటీసీ సభ్యులు గోపాల్, సుజాత, ఏపీఓ బాలాజి, రాజేష్, నర్సింహులు, శివకుమార్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

మద్దూరు: తెలంగాణ ఉద్యమంలో అమరుల త్యాగం మరచిపోలేమని ఎంపీపీ విజయలక్ష్మి, ఎంపీడీఓ విజయలక్ష్మి అన్నారు. అమరవీరులు సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం మండల పరిషత్ కార్యాలయంలో అమరవీరులకు నివాళులర్పించారు. రెండు నిమిషాలు మౌనం పాటించారు.

ఊట్కూర్: మండల కేంద్రంలోని ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాల్లో తెలంగాణ అమరవీరులకు ప్రజాప్రతినిధులు, అధికారులు నివాళులర్పించారు. రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎల్కోటి లక్ష్మి, తహసీల్దార్ తిరుపతయ్య, ఎంపీడీఓ కాళప్ప, ఎంపీటీసీ హన్మంతు, ఈసీ శ్రీనివాస్, కొండన్న, అఫ్జల్ తదితరులు పాల్గొన్నారు.



ఊట్కూర్ ఎంపీడీఓ కార్యాలయంలో రెండు నిమిషాలు మౌనం పాటిస్తున్న నాయకులు



మరికల్‌లో..

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

సాక్షి ఎఫెక్ట్..

మాగనూర్: ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని ఇన్‌చార్జ్ ఎంఈఓ వెంకటయ్య హెచ్చరించారు. ‘మధ్యాహ్న భోజనం లేక విద్యార్థుల అవస్థలు’ అనే శీర్షికతో కథనం గురువారం ప్రచురితం అయ్యింది. దీంతో ఎంఈఓ స్పందించి మండలంలోని వర్కూర్, బైరంపల్లి పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా వర్కూర్ పాఠశాలలో విద్యార్థికి స్కూటర్ ఇచ్చి పనులకు పంపించిన ఉపాధ్యాయుడికి మెమో జారీ చేశారు. అదేవిధంగా విధుల్లో నిర్లక్ష్యం వహించిన గురువలింగంపల్లి, తళంకేరి, బైరంపల్లి పాఠశాలల ఉపాధ్యాయులకు మెమోలు జారీ చేశారు. అనంతరం బైరంపల్లి పాఠశాలలో మధ్యాహ్న భోజనం నిర్వహణపై సర్పంచ్ మంజులతో సమావేశమయ్యారు. అనంతరం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డించారు. విద్యార్థులకు భోజనం అందించకపోతే వంట ఏజెన్సీ మార్చుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఆర్పీ ఎల్లాగౌడ్, గ్రామస్తులు రాఘవేంద్ర, సైదేష్, రాఘవేంద్రగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



బైరంపల్లిలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న ఇన్‌చార్జ్ ఎంఈఓ వెంకటయ్య

భూములు ఆక్రమించకుండా చర్యలు తీసుకోవాలి

కృష్ణా: ప్రభుత్వ భూములు ఆక్రమించకుండా చర్యలు తీసుకోవాలి బీజేపీ మండల నాయకుడు హిందుపూర్ ఆంజనేయులు డిమాండ్ చేశాడు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని ప్రధాన రోడ్డు పక్కన ఉన్న విలువైన ప్రభుత్వ భూములను వెంటనే ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలన్నారు. ఇతర రాష్ట్రాలకు చెందిన కొందరు అక్రమార్కులు ప్రభుత్వ భూములను ఆక్రమించుకొని వ్యాపారాలు చేస్తున్నారన్నారు. ఈ విషయమై జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని ఆరోపించారు. ప్రభుత్వం స్పందించకపోతే ఆందోళన కార్యక్రమాలను చేపడుతామని హెచ్చరించారు.

విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ

మాగనూర్: మండలంలోని ఉజ్జెల్లి పాఠశాలలో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను గురువారం టీఎస్ టీపీసీ మాజీ చైర్మన్ దేవర మల్లప్ప పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు చాలా అద్భుతంగా ఉన్నాయన్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, ఉచిత యూనిఫాంలు, మధ్యాహ్న భోజనం, రాగిజావతో అందించడంతో పాటు అనుభవం కలిగిన ఉపాధ్యాయులతో విద్యాబోధన ఉంటుందన్నారు. మొత్తం 178 మంది విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మమ్మ, ఉప సర్పంచ్ స్వప్న, ఎస్‌ఎంసీ చైర్మన్ మేకల నర్సింగప్ప, మాజీ సర్పంచ్ వాకిటి రాజు, రవి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సాయిబాబా, ఉపాధ్యాయులు అరుణ, కృష్ణవేణి, భవ్యశ్రీ, మహేష్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బడి బయటి పిల్లలను బడిలో చేర్పించాలి..

ఊట్కూరు: బడిబయటి పిల్లలను బడిలో చేర్పించాలని సర్పంచ్ శాంతమ్మ కోరారు. గురువారం మండలంలోని కొత్తపల్లి పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశాన్ని నిర్వహించారు. ముందుగా తెలంగాణ అమరవీరులకు రెండు నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. సమావేశంలో ఊరి పిల్లలందరు గ్రామంలోని పాఠశాలలోనే చదివించాలని గ్రామానికి ప్రైవేటపాఠశాలల వాహనాలు రావొద్దని గ్రామస్తులు తీర్మాణం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో ఉచితంగా పుస్తకాలు, దుస్తులు, మధ్యాహ్న భోజనం అందుతుందన్నారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య 70కి చేరడంతో ఉపాధ్యాయులను అభినందించారు. సమావేశంలో హెచ్‌ఎం గోపాల్, కార్యదర్శి సాయినాథ్, ఉప సర్పంచ్ అంజమ్మ, ఎస్‌ఎంసీ చైర్మన్ చిన్ననర్సింహులు, వార్డు మెంబర్ రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



పాఠ్య పుస్తకాలు పంపిణీ చేస్తున్న దేవర మల్లప్ప

మురుగుకాల్వ నిర్మాణానికి భూమి పూజ



ఊట్కూర్: మండలంలోని తిప్రాస్‌పల్లిలో మురుగు కాల్వ నిర్మాణానికి గురువారం సర్పంచ్ సుమంగళ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంచాయతీ నిధులతో శివమోళ నర్సిములు ఇంటి నుంచి ఆర్‌అండ్‌బీ రోడ్డు వరకు మురుగుకాల్వ నిర్మిస్తున్నామన్నారు. ఎంపీటీసీ కావలి రవి, బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు కావలి సురేశ్, వార్డు సభ్యులు లక్ష్మి, అంజిలమ్మ గ్రామస్తులు నర్సిములు, సాకలి సుభాష్ పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత

దామరగిద్ద: మండలంలోని కంసాన్‌పల్లికి చెందిన మంగు వెంకటప్ప 20 రోజుల కిందట తన సెల్‌ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్ఐ శ్రీనివాస్ సీఈఐఆర్ వైబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేశారు. ఫోన్ దొరకడంతో గురువారం వెంకటప్పకు ఎస్ఐ శ్రీనివాస్ ఫోన్ అందజేశారు.

కార్యదర్శులకు ప్రశంసాపత్రాల అందజేత



పంచాయతీ కార్యదర్శికి ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న ఎంపీపీ, ఎంపీడీఓ

మద్దూరు: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల ముగింపు సందర్భంగా గురువారం మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ విజయలక్ష్మి, ఎంపీడీఓ విజయలక్ష్మి, ఎంపీఓ ఉదయ్‌శంకర్ పంచాయతీ కార్యదర్శులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. దాదాపు 21 రోజుల పాటు గ్రామాల్లో దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయడానికి కార్యదర్శుల కృషి ఎంతో ఉందన్నారు. అనంతరం ఎంపీడీఓ విజయలక్ష్మి దామరగిద్ద మండలానికి బదిలీ కావడంతో ఆమెను ఎంపీపీ, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది, ఎంపీఓ, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బంది శాలువా పూలమాలలతో సన్మానించి వీడ్కోలు పలికారు.

మహిళ బలవన్మరణం

మక్తల్: రెండో పెళ్లి ఇష్టం లేక మహిళ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గురువారం చోటుచేసుకుంది. ఎస్ఐ పర్వతాలు వివరాల ప్రకారం మండలంలోని గుడిగండ్ల గ్రామానికి చెందిన లొద్ద గోవిందమ్మ(27)కు జక్లేర్ గ్రామానికి చెందిన వెంకటయ్యతో ఎనిమిదేళ్ల కిందట వివాహం అయ్యింది. కొన్నేళ్ల కిందట ఆమె భర్త అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో అప్పటినుంచి పుట్టింటి వచ్చి జీవనం సాగిస్తుంది. కుటుంబసభ్యులు రెండో పెళ్లి చేసేందుకు నిర్ణయించడంతో గోవిందమ్మ మనస్థాపంతో ఆత్మహత్య చేసుకుంది. తండ్రి లొద్ద వెంకటయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

హామీల అమలులో బీఆర్‌ఎస్ ప్రభుత్వం విఫలం

మద్దూరు: హామీల అమలులో బీఆర్‌ఎస్ ప్రభుత్వం విఫలం అయ్యిందని జెడ్పీటీసీ రఘుపతిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నర్సింహా అన్నారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు గురువారం మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని పాతబస్టాండ్ చౌరస్తాలో సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ దశాబ్ది పేరుతో ప్రజలను సీఎం కేసీఆర్ మోసం చేస్తున్నారని దీంతో పది తలల సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్నామన్నారు. ప్రజాధనాన్ని తన పార్టీ ప్రచారం కోసం ఉపయోగించారని ఆరోపించారు. అంతకు ముందు భారీ ఊరేగింపు, డప్పు చప్పుళ్ల మధ్య 10 తలలతో ఏర్పాటు చేసినా సీఎం దిష్టిబొమ్మను ఊరేగించారు. అనంతరం చౌరస్తాలో ధర్నా చేపట్టారు. ఈ ధర్నా పాతబస్టాండ్ చౌరస్తాలో దాదాపు గంటపాటు కొనసాగింది. కార్యక్రమంలో నాయకులు సంజీవ్, బాబుస్వామి, మహేందర్‌రెడ్డి, రహీం, రమేష్‌రెడ్డి, బాల్‌రాజ్, చెన్నప్ప, చంద్రమోహన్, హుసేన్, ఇబ్రహీం పాల్గొన్నారు.



పాతబస్టాండ్ చౌరస్తాలో కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

బస్సుల సంఖ్య పెంచాలని వినతి

నారాయణపేట రూరల్: డిపో పరిధిలో విద్యార్థుల సౌకర్యార్థం మరిన్ని బస్సులు కేటాయించాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సాయికుమార్ గురువారం ఈడీ పురుషోత్తంను కలిసి వినతిపత్రం అందించారు. అనంతరం ఆర్‌ఎం శ్రీదేవి, డీఎం ఆంజనేయులుతో మాట్లాడారు. జిల్లాలో వివిధ గ్రామాల విద్యార్థులు పట్టణాలకు చదువుకునేందుకు వెళ్తున్నారని.. సమయానికి బస్సులు అందుబాటులో ఉండటం లేదని తెలిపారు. విద్యార్థులకు సరిపడా బస్సులు తిప్పాలని, లేకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వెంకటేష్, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన సింగిల్‌విండో కార్యవర్గ సమావేశం

ధన్వాడ: స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం భవనంలో గురువారం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. అధ్యక్షుడు వెంకట్రాంరెడ్డి ఆధ్వర్యంలో పలు అభివృద్ధి పనులపై తీర్మానాలు చేశారు. పాతపల్లి, గోటూరు, కొండ్రోన్‌పల్లి గ్రామాలకు కొత్తగా స్వల్పకాలిక రుణాలు రూ.50 లక్షలు కేటాయించారు. అలాగే మండల కేంద్రంలో ఉన్న గోదాంకు ప్రహరీ, భూ కొనుగోలుకు తీర్మానం చేశారు. సీఎస్ సెంటర్‌ను ప్రభుత్వం కేటాయించిందని.. త్వరలో ధన్వాడలో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. డీసీసీబీ బ్యాంకు మేనేజర్ కల్పనారెడ్డి మాట్లాడుతూ.. గ్రామస్థాయిలో హౌసింగ్, ఎడ్యుకేషన్ రుణాలు ఇస్తున్నామని, భూమి ఉన్న రైతులు ఎకరాకు రూ.నాలుగు లక్షల వరకు రుణం పొందవచ్చని తెలిపారు. ఇంటి రుణాలను కొత్తగా ప్రారంభించినట్లు వివరించారు. సమావేశంలో సీఈఓ వెంకట్రాములు, ఉపాధ్యక్షుడు గండి బాలరాజు, డైరెక్టర్లు శ్రీనివాస్, భాస్కర్, మోహన్‌రెడ్డి, రూప్లానాయక్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలను ఇబ్బందులకు గురిచేయొద్దు

- టీఎస్‌ఏటీయూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి విజయలక్ష్మి

నారాయణపేట: చిన్న చిన్న విషయాలకు మోమోలు జారీచేయడం, తొలగింపులకు పాల్పడుతూ అంగన్‌వాడీలను ఆందోళనకు గురిచేస్తున్న అధికారులు తమ తీరు మార్చుకోవాలని.. లేనిపక్షంలో ఉద్యమించక తప్పదని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి విజయలక్ష్మి హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీల సమస్యలపై నిర్వహిస్తున్న జీపుజాత గురువారం జిల్లాకు చేరుకుంది. స్థానిక మున్సిపల్ పార్క్ దగ్గర సంఘం జిల్లా కార్యదర్శి మంజుల అధ్యక్షతన జరిగిన సభలో విజయలక్ష్మి మాట్లాడారు. ఇప్పటి వరకు 150 మంది అంగన్‌వాడీలకు మెమోలు ఇవ్వడమేగాక ఏడుగురిని తొలగించారన్నారు. జీఓనంబర్ 14ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రం ప్రతి బడ్జెట్‌లో ఐసీడీఎస్‌కు నిధులు తగ్గిస్తోందన్నారు. అంగన్‌వాడి టీచర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీలకు బీఎల్వో డ్యూటీలను వెంటనే రద్దు చేయాలన్నారు. కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, రిటైర్మెంట్ ప్రయోజనం టీచర్‌కు రూ.5 లక్షలు, హెల్పర్‌కు రూ.3 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు జి.వెంకట్రామారెడ్డి, సీఐటీయూ జిల్లా కన్వీనర్ బాల్‌రాం, నాయకులు కాశప్ప, రాధిక, మణెమ్మ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విజయలక్ష్మి

పేదల సంక్షేమమే బీజేపీ ధ్యేయం



మక్తల్‌లో ఇంటింటికి కరప్రతాలను అందజేస్తున్న ఎంపీటీసీ సభ్యులు

మక్తల్: పేదల సంక్షేమమే బీజేపీ ధ్యేయమని నియోజక వర్గ అసెంబ్లీ బీజేపీ కన్వీనర్ కర్నిస్వామి అన్నారు. గురువారం పట్టణంలో ఎనిమిదో వార్డు కౌన్సిలర్ ప్రసన్న రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రచారం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం తొమ్మిదేళ్ల పాలనలో ప్రవేశపెట్టిన పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఇంటింటికి కరపత్రాలను అందజేశారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ప్రజలకు బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై నమ్మకం పోయిందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీల మండల సంఘం అధ్యక్షుడు బాల్‌రాంరెడ్డి, సంగంబండ ఎంపీటీసీ తిమ్మప్ప, ఎల్ఐసీ ఏజెంట్ గంగాధర్‌రెడ్డి, అంజి పాల్గొన్నారు.

ఊట్కూర్: మండల కేంద్రంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి భాస్కర్ ఆధ్వర్యంలో గురువారం ఇంటింటికి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలపై ప్రచారం చేశారు. ఈ సందర్భంగా తొమ్మిదేళ్ల పాలనలో జరిగిన అభివృద్ధిని వివరించారు. అనంతరం గడపగడపకు కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ హన్మంతు, మండల అధ్యక్షుడు రమేశ్, నాయకులు కృష్ణయ్య గౌడ్, రఘువీర్, లక్ష్మణ్, శ్రీకాంత్, రణవీర్, అశోక్ పాల్గొన్నారు.

దామరగిద్ద: కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న ప్రజా సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించేందుకు బీజేపీ మండలశాఖ ఆధ్వర్యంలో గురువారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు సత్యనారాయణ, జిల్లా కార్యదర్శి గోపాల్ మాట్లాడుతూ.. కిసాన్ సమ్మాన్ నిధి, ఎన్ఆర్ఈజీఎస్ పథకంలో తోటల సాగుకు రాయితీ, ఉపాధి కల్పన, వ్యవసాయ, గ్రామాభివృద్ధి పనులు కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సభి, చాపలి వెంకటయ్య, ఆంజనేయులు, కన్కిరెడ్డి, ఉసెనప్ప, శ్రీను, ఉదయ్, వీరేష్, వెంకట్, నర్సింహ పాల్గొన్నారు.

మరికల్: పార్టీ రాష్ట్రశాఖ పిలుపు మేరకు గురువారం మండలంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటి ప్రచారం చేపట్టారు. పార్టీ రాష్ట్ర నాయకుడు నర్సన్‌గౌడ్ మాట్లాడుతూ.. 9 ఏళ్ల పాలనలో ప్రధాని మోదీ చేపట్టిన సంక్షేమ పథకాలను ఇంటింటికి వెళ్లి వివరిస్తున్నట్లు తెలిపారు. రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ తిరుపతిరెడ్డి, బీజేవైఎం జిల్లా కన్వీనర్ తిరుపతిరెడ్డి, జిల్లా దళిత మోర్చా కన్వీనర్ నార కొండయ్య, మండలపార్టీ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, వేణు, రమేష్, ఆంజనేయులు పాల్గొన్నారు.

రిజర్వేషన్ దుర్వినియోగాన్ని అరికట్టాలి

నారాయణపేట: ఎస్సీల రిజర్వేషన్ దుర్వినియోగాన్ని ప్రభుత్వం అరికట్టాలని ఎస్సీ పరిరక్షణ సమితి జాతీయ ఉపాధ్యక్షుడు దేవేంద్రప్ప కోరారు. గురువారం జిల్లాకేంద్రంలోని అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ నుంచి క్రిస్టియన్లుగా మారిన వారికి బీసీ సర్టిఫికెట్ ఇవ్వాలని రాజ్యాంగం చెబుతున్నా.. ఓట్ల కోసం పార్టీలు వారికి వంత పాడుతూ ప్రోత్సహిస్తున్నాయని, అసలైన ఎస్సీలకు అన్యాయం జరుగుతుందని తెలిపారు. ఇప్పటికైనా ఎస్సీలు జాగృతం కాకపోతే రాబోవు తరాలకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. ఎస్సీలకు అవగాహన కల్పించేందుకు ఈ నెల 24న జిల్లాకేంద్రంలో సదస్సు నిర్వహించనున్నట్లు వివరించారు. బాల్‌రాం, వెంకటేశ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దేవేంద్రప్ప

ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలి

దామరగిద్ద: రెండు పడక గదుల ఇళ్ల పంపిణీ పథకాన్ని పూర్తిస్థాయిలో అమలుచేసి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని బీఆర్‌ఎస్ పార్టీ నిలబెట్టుకోవాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి అంజిలయ్యగౌడ్ కోరారు. గురువారం ప్రజాసంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో అయ్యవారిపల్లి, దామరగిద్దతండాలో ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పేదలు ఇళ్లు నిర్మించుకోలేక పూరి గుడిసెలు, రేకుల షెడ్‌లలో నివసిస్తున్నారన్నారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టే ఆందోళనకు అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ లాలప్ప, ప్రసాద్, అరుణ్ గోవింద్ పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు

మాగనూర్: నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని ఇన్‌చార్జ్ ఏఓ సుదర్శన్‌గౌడ్, ఎస్ఐ మల్లేష్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని లక్ష్మీనరసింహ ట్రేడర్స్, రైతు ఆగ్రోస్‌ల దుకాణాలను వారు ఆకస్మికంగా తనిఖీ చేశారు. దుకాణాలలోని రిజిస్టర్లను పరిశీలించారు. విత్తన ప్యాకెట్స్‌ను, ఎరువులను, బిల్ బుక్స్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నకిలీ విత్తనాలు అమ్మి పట్టుబడితే వారిపై పీడీ యాక్ట్ నమోదు చేస్తామన్నారు. రైతులు విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేస్తే రశీదులు పొందాలన్నారు. విత్తనాలు కొనే ముందు తప్పకుండా వ్యవసాయ అధికారులను సంప్రదించి సూచనలు, సలహాలు తీసుకోవాలని తెలిపారు.



రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు..

మద్దూరు: నిబంధనల మేరకు విత్తనాలు, ఎరువులు విక్రయించాలని ఎవరైన నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ శీనయ్య హెచ్చరించారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు దళారులను ఆశ్రయించి మోసపోవద్దన్నారు. లైసెన్స్ ఉన్న దుకాణాలలో మాత్రమే కొనుగోలు చేయాలని సూచించారు. ఎక్కడైన నకిలీ విత్తనాలు అమ్ముతున్నట్లు సమాచారం తెలిస్తే డయల్ 100 కు సమాచారం ఇవ్వాలని కోరారు.